


కెనడాలోని అల్బెర్టా ప్రాంతంలో రగులుకున్న కార్చిచ్చు పలు ప్రాంతాలకు విస్తరిస్తున్నది. ఫలితంగా, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా జాస్ డొవర్, ఫాక్స్‌లేక్, గార్డెన్ రివర్ తదితర ప్రాంతాల ప్రజలకు అధికారులు సూచించారు. అల్బెర్టాలో సుమారు 62,000 హెక్టార్ల విస్తీర్ణంలోని అటవీ ప్రాంతంలో 158 చోట్ల మంటలు చెలరేగి-నట్టు అధికారులు ప్రకటించారు. వీటిలో 55 చోట్ల మంటలను అదుపు చేయడం కష్టసాధ్యంగా మారిందని తెలిపారు. 500 మంది అగ్నిమాపక సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్నారన్నారు.

ప్రపంచం

# ప్రజారోగ్యంపై శ్రద్ధ.. కార్మికుల వేతనాలు పెంపు

## కొలంబియా కొత్త ప్రభుత్వం కీలక నిర్ణయాలు



**బొగోటా (కొలంబియా):** కొలంబియాలో కొత్తగా రూపుదిద్దుకున్న వామపక్ష ప్రభుత్వం ప్రజారోగ్యంపై శ్రద్ధ పెడుతున్నట్టు ప్రకటించింది. అదే విధంగా వేతనాల పెంపును కూడా ప్రకటించింది. ప్రభుత్వ ఏర్పాటు అనంతరం కొలంబియా మొట్టమొదటి వామపక్ష అధ్యక్షుడు గుస్తావో పెట్రో కాంగ్రెస్ (పార్లమెంటు)లో మాటాలడుతూ ప్రభుత్వ విధానాలను ప్రకటించారు. ఆరోగ్యానికి ఇతోధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. అదే విధంగా కార్మికుల కవోసం ఉసంస్కరణలు తీసుకువస్తామని, వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. పెన్షన్ వ్యవస్థను మార్చడం, రైతులకు భూమి పునఃపంపిణీ చేయడం, సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన వారి కుటుంబాలకు అవసరమైన సహాయసహకారాలు అందించడం తదితర లక్ష్యాలను ఆయన సభ్యుల ముందు ఉంచారు. ఆరోగ్య వ్యవస్థపై తన ఆలోచనలకు సభ్యులతో ఆమోదముద్ర వేయించడానికి పెట్రో విపరీతంగా శ్రమించాల్సి వచ్చింది. అయినప్పటికీ, ఆయన తన పట్టు వీడక, అందరినీ ఒప్పించి మరీ కొత్త విధానాలను శ్రీకారం చుట్టారు. పెట్రో కుమారుడు నికొలాస్‌పై పలు అవినీతి ఆరోపణలు రావడం, మనీలాండరింగ్ కేసులో అతనిని పోలీసులు అరెస్టు చేయడం వంటి విపరీత పరిణామాలు కొలంబియాలో చోటు చేసుకున్నాయి. దీనితో పెట్రో ప్రజాదరణ కొంత తగ్గింది. ఈ సమస్య నుంచి బయటకు వచ్చి, తన నిజాయితీని రుజువు చేసుకోవడానికి పెట్రో ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలోనే ప్రజాహిత కార్యకలాపాలను ప్రారంభిస్తున్నారు. అదే సమయంలో, కార్మిక సంస్కరణలకు హామీ ఇచ్చారు. పార్లమెంటులో ప్రకటన చేయడం ద్వారా తాను ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నానని నిరూపించుకున్నాడు. ఆరోగ్య సంరక్షణ కోసం, ప్రస్తుతం కీలకంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు బీమా కంపెనీలను పక్కకుపెట్టి, రుసుములను వసూలు చేసే బాధ్యతను ప్రభుత్వ ఏజెన్సీకి అప్పగించాలని ఆయలో ప్రతిపాదిస్తున్నారు. అదే విధంగా, తాత్కాలిక ప్రాతిపదికన కార్మికులను నియమించుకునే అవకాశాలను కఠినతరం చేయాలని, ఫలితంగా కాంట్రాక్టు కార్మిక విధానంలో నియామకాలు తగ్గి, ఉద్యోగ భద్రత సాధ్యమవుతుందని పెట్రో అంటున్నారు. ఈ కొత్త నిర్ణయాలు, పథకాలు పెట్రో ప్రతిష్ఠను ఎంత వరకూ తిరిగి నిలబెడతాయో చూడాలి.

# యెమెన్‌పై ఇజ్రాయెల్ దాడులు




**సనా (యెమెన్) :** గాజా స్ట్రిప్‌లో సమాస్ ఉగ్రవాదులను ఏరివేస్తామని ప్రకటించిన తర్వాత, సుమారు తొమ్మిదిన్నర నెలలుగా ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులు, కొనసాగిస్తున్న మారణకాండను ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. అదే సమయంలో, ఇరాన్, యెమెన్, లెబనాన్ తదితర దేశాలు సైతం ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మద్దతునిస్తున్నాయి. ఇలావుంటే, టెల్ అవీవ్‌పై డ్రోన్ దాడికి ప్రతీకారంగా ఇరాన్ మద్దతుగల హౌతీ మిలిటెంట్లతో సంబంధం ఉన్న యెమెన్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులు జరిగింది. ఓడరేవు నగరమైన హొడైదాలోని మిలిటెంటు స్థావరాలను గుర్తించి బాంబు దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. హౌతీ మిలిటెంటు స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నట్టు వివరించింది. అయితే, హొడైదాకు సుమారు1,600 కిలోమీటర్ల దూరంలోని సైనిక స్థావరాలపైన కూడా దాడులు జరిగాయని యెమెన్ ఆరోపిస్తుండగా, ఆ వార్తలను ఇజ్రాయెల్ తోసిపుచ్చింది. హౌతీల నుంచి దాడులు పెరుగుతున్నాయని, దీనితో ఎదురుదాడి తప్పడం లేదని ప్రకటించింది.

కాగా, ఇజ్రాయెల్ వైఖరిని నిరసిస్తున్న హెజ్బొల్లా గ్రూప్ తాజాగా మరోసారి డ్రోన్ దాడులు చేసింది. ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్ పౌరులు మృతి చెందారని, ఆ ఘటనకు ప్రతీకారంగానే డ్రోన్ దాడులు చేపట్టామని హెజ్బొల్లా ప్రకటించింది. మొత్తం మీద దాడులు, ప్రతిపాదులతో ఇజ్రాయెల్ సమస్యలను ఎదుర్కొంటున్నది. ఇప్పటికే గాజా స్ట్రిప్‌లో పాలస్తీనియన్లపై జరుగుతున్న దాడులను ప్రపంచ దేశాలు తప్పుపడుతున్నాయి. కాల్పుల విరమణకు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, అందుకు ఇజ్రాయెల్ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో, ఒకవైపు హీఎజ్బొల్లా, మరోవైపు హౌతీ సమూహాలు డ్రోన్ దాడులకు తెగబడుతున్నాయి. ఒకే సమయంలో పాలస్తీనా, యెమెన్, లెబనాన్ దేశాలను ఎదుర్కోవాల్సి రావడం ఇజ్రాయెల్‌కు భారమవుతున్నది.

# ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం

## అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**లాన్సింగ్ (మిషిగాన్) :** దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణే తన ధ్యేయమని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన హత్యాయత్నం నుంచి ట్రంప్ తృటిలో తప్పించుకున్న విషయం తెలిసిందే. బులెట్ తూటా ఆయన కుడి చెవిని తాకుతూ దూసుకెళ్లింది. ఆ ఘటన తర్వాత మొదటిసారి ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న ట్రంప్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మద్దతుగా నిలబడ్డాడనని, తుపాకీ తూటాను కూడా ఎదుర్కొన్నానని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యానికి ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ప్రమాదకరంగా మారారని విమర్శించారు. రిపబ్లికన్ పార్టీ తరఫున ట్రంప్, డెమోక్రాటిక్ పార్టీ తరఫున బైడెన్ మరోసారి అమెరికా అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్నారు. గత ఎన్నికల్లో బైడెన్ చేతిలో ఓటమిపాలైన ట్రంప్ ఈసారి విజయం సాధించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని వివిధ సర్వేలు, అభిప్రాయ సేకరణ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. హత్యాయత్నం తర్వాత ట్రంప్ గ్రాఫ్ మరింత పెరిగింది. తొలి డిబేట్‌లో ట్రంప్ ఎంతో ఉత్సాహంగా పాల్గొనగా, బైడెన్ తడబడడం, స్పృహ తప్పి పడిపోతాడేమోనన్న రీతిలో నీరసం గా కనిపించడం ఆయన ఆరోగ్యంపై సందేహాలకు కారణమైంది. తనతో గోల్ఫ్ ఆడాలంటూ బైడెన్‌కు ట్రంప్ సవాలు విసిరారు కూడా. అమెరికా వైస్‌ప్రెసిడెంట్‌గా ఉన్న కమలా హారిస్‌ను బరిలోకి దించాలన్న అభిప్రాయం వ్యక్తం కాగా, తాను పోటీ నుంచి తప్పుకునేది లేదని బైడెన్ తేల్చిచెప్పారు. అయితే, ఇప్పటికే ఆయన అభ్యర్థిత్వంపై నీలినీడలు ముసురుకునే ఉన్నాయి. నవంబర్ 5న జరిగే ఎన్నికల్లో విజయం ఎవరిని వరించినా, ఈసారి పోటీ ఆసక్తికరంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.




# పాకిస్తాన్‌లో జర్నలిస్టులకు భద్రత కరువు




అస్తవ్యస్త రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో, పాకిస్తాన్‌లో జర్నలిస్టులకు భద్రత కరువైంది. నిజాలను వెలుగులోకి తేవడమే వారి నేరం. ఈ ఏడాది కనీసం ఏడుగురు జర్నలిస్టులు హత్యకు గురికావడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. అఫ్గానిస్థాన్ సరిహద్దులోని కైబర్ ఫఖ్తుంక్వా ప్రావీన్స్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ జర్నలిస్టు ఖలీల్ జిబ్రాన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేయడంతో మరోసారి పాత్రికేయులపై దాడుల అంశం తెరపైకి వచ్చింది. విధులకు హాజరయ్యేందుకు వెళుతున్న అతనిని ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అడ్డుకున్నారు. కారు నుంచి బయటకులాగి, విచక్షణారహితంగా కాలల్పులు జరిపారు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. జర్నలిస్టుల హత్యలను పరిశోధించే సంస్థలో పని చేస్తున్న అదిల్ జవాద్ మీడియాతో మాట్లాడుతూ, ఏడుగురు పాత్రికేయులు హత్యకు గురికావడం ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నాడు. చిన్నపట్టణాల్లోగాక, నగరాల్లోనూ హత్యలు జరిగినట్టు చెప్పాడు. దాడులు కూడా విపరీతంగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశాడు. నేరస్థులకు సరైన శిక్ష పడకపోవడమే ఈ దాడులకు, హత్యలకు కారణమని అభిప్రాయపడ్డాడు. కాగా, సింధ్ ప్రావీన్స్‌లోని బాడిన్ జిల్లాలో పాత్రికేయుడు నస్రుల్లా గదానీ హత్యకు గురయ్యాడు. అంతకు మూడు రోజుల ముందు కైబర్ ఫఖ్తుంక్వాలోని ఉత్తర వజీరిస్తాన్ జిల్లాలో కమ్రాన్ దావర్ అనే మరో జర్నలిస్టును చంపేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలను ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ప్రదాన కార్యదర్శి ఆంథోనీ బెల్లంగర్ ఖండించారు. పాకిస్తాన్ ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టుల రక్షణకు చర్యలు తీసుకోవాలని, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఎల్లో అలెర్ట్ (మొదటి పేజీ తరువాయి)

మధ్యగా వెళ్తుందన్నారు. ఈ క్రమంలో రాగల మూడురోజు రోజుల్లో తేలిక పాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములు మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణ కేంద్రం అధికారులు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశారు.

## ఢిల్లీలో సిఎం రేవంత్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర నీటిపారుదలశాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్‌తో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఢిల్లీలో శనివారం జరిగిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటి(ఎన్‌డిఎస్‌ఎ) సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ దృష్టికి తీసు కెళ్లారు. ఆయా అంశాలపై ముఖ్యమంత్రి తనఅభిప్రాయాలను వారికి తెలి యజేశారు. సోమవారం ఢిల్లీలో జరగనున్న ఎన్‌డిఎస్‌ఎ సమావేశంలో అధికారులు, ఇంజినీర్లు సమావేశంపైన ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

## నిఫా కలకలం (మొదటి పేజీ తరువాయి)

బాలుడి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి నిర్ణయం తీసుకుంటారన్నారు. మలప్పురం జిల్లాలో నిఫా వ్యాప్తికి పాండిక్కాడ కేంద్రంగా ఉంది. ప్రజలు, సమీప ఆసుపత్రులు బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని, ఆసుపత్రుల్లో రోగుల వద్దకు వెళ్లొద్దని ఇప్పటికే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని వీణా జార్జ్ పేర్కొన్నారు. పుణె ఎన్‌ఐవిలో నిల్వ చేసిన ఆస్ట్రేలియా నుంచి తీసుకొచ్చిన మోనోక్లోనల్ యాంటీబాడీ ఆదివారం రాష్ట్రానికి వస్తుందని మంత్రి ప్రకటించారు. ఆరోగ్య శాఖ మంజేరి మెడికల్ కాలేజీలో 30 ఐసోలేషన్ గదులు, ఆరు పడకల ఐసియును ఏర్పాటు చేసి కరోనా సోకిన బాలుడితో కాంటాక్ట్ అయిన ప్రతి ఒక్కరినీ ఐసోలేట్ చేసినట్లు చెప్పారు.

## విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి

(మొదటి పేజీ తరువాయి)

బాత్‌రూంలోకి వెళ్లాడు. బకీట్ నీళ్లను వేడి చేసేందుకు హీటర్‌ను ఆన్ చేశాడు. బకీట్‌లో ఉన్న నీళ్ల వేడి అయ్యాయో లేదే తెలుసుకునేందుకు హరికృష్ణ నీళ్లలో చేతులు పెట్టాడు. నీళ్లలో కరెంట్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురైన కింద పడిపోయాడు. హరికృష్ణను రక్షంచే క్రమంలో తల్లిదండ్రు లు వెంకటేష్, మాధవిలు ప్రయత్నించారు. వీరిద్దరు కూడా విద్యుదాఘాతానికి గురయ్యారు. ముగ్గురు కూడా విద్యుదాఘాతానికి గురై బాత్‌రూమ్‌లోనే మృతి చెందారు. సాయంత్రం వరకు కూడా 204 ఫ్లాట్ నుంచి ఎవరు బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన అపార్ట్‌మెంట్‌వాసులు సాయంత్రం ప్రాంతంలో వెంకటేష్ ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బాత్‌రూమ్‌లో వారి మృతదేహాలు కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి క్లూస్ టీంతో పాటు పోలీసులు చేరుకుని పరిశీలించారు. ముగ్గురు కూడా విద్యుదాఘాతానికి గురై మృతిచెందారని పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం గాంధీఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కృష్ణా, గోదావరి పరవళ్లు

(మొదటి పేజీ తరువాయి)

వరదల భయం అలుముకుంటుంది. ఈ మూడునెలల పాటు ఇక్కడి ప్రజలకు కష్టాలుతప్పవు. కొన్నిసార్లు జూన్ నెలలో కూడా వరదలు వచ్చాయి. ఈ ప్రధానంగా ఈ మూడు నెలల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. గోదావరి భారీగా పొంగితే ప్రధాన రోడ్లపై తిష్ట వేస్తుంది. 1976 నుండి 2024 జూలై వరకు గోదావరికి 48సార్లు వరదలు వచ్చాయి. ఇందులో ప్రధానంగా 1986 ఆగస్టులో 75.06 అడుగుల వరద వచ్చింది. అదే ఆల్‌టైమ్ రికార్డుగా మిగిలిపోయింది. ఆ తర్వాత 2022 జూలై 16న 71.03 అడుగుల రెండో రికార్డు వరదగా నమోదైంది.

**అంతర్రాష్ట్ర రాకపోకలు అంతరాయం**

గోదావరి భారీగా పెరుగుతూ ములుగు జిల్లాలోని వాజేడు మండలం పేరూరు వద్ద 15.790 మీటర్లకు చేరడంతో తెలంగాణ, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల మధ్య సరిహద్దులోని 163 జాతీయ రహదారి నీట మునిగింది. దీనితో అంతర్రాష్ట్ర రాకపోకలు స్తంభించాయి. ప్రమాద భరితంగా ఉన్నందున తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రోడ్డు రవాణాను నిలిపివేశారు. అటువైపు ఎవరు కూడా వంతెన దాటే ప్రయత్నం చేయకూడదని హెచ్చరికలు జారీ చేస్తూ భార్గెట్లను ఏర్పాటు చేశారు.

**పరవళ్ళు తొక్కుతున్న బొగత జలపాతం**

జోరుగా కురుస్తున్న వర్షాలకు వాజేడు మండలంలోని చీకుపల్లి బొగత బొగత జలపాతం పరుగులు తొక్కుతుంది. బొగత జలపాతం ఉగ్రరూపం దాల్చి ఉధృతం ప్రవహిస్తుండగా, జలపాతం లోయలోకి పర్యాటకులను స్నానాలు చేసేందుకు అనుమతించడం లేదు.



కాళేశ్వరం

**కాళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం**

ఎగువలోని తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతుంటంతో త్రివేణి సంగమ తీరం వద్ద గోదావరి నిండుకుండలా మారి పుష్కర ఘాట్ స్నాన ఘట్టాలను ముంచెత్తి ఇవతలి, అవతలి ఇరువైపులా ఒడ్డును తాకి గోదావరి పరవళ్ళు తొక్కుతోంది. పుష్కర ఘాట్ తీరం వద్ద సాయంత్రం 5 గంటల కల్లా 9.790 మీటర్ల నీటి మట్టానికి చేరుకొని ఉధృతంగా ప్రవహిస్తోంది. కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెన వద్ద గోదావరి నురుగులు పెడుతూ ప్రవహిస్తోంది.

**ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద**

మంచిర్యాల జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. నిన్న మొన్నటి వరకు తాగు నీరు అందించలేని ప్రాజెక్టులో ఒకే సారిగా వరద నీరు చేరడంతో నిండు కుండలా తలపిస్తుంది. కొమురం భీం ప్రాజెక్టులో సైతం వదర నీరు పరిమితికి మించి చేరడంతో గేట్లు ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. జిల్లాలోని అనేక గ్రామాలు, మంచిర్యాల జిల్లాకేంద్రంలోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంట నీట మునిగి ఆందోళనకు గురవుతున్నారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలోని భూ ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటకం కలుగుతుంది. ఇప్పటికే అన్ని ఉపరితల గనుల్లో ఉత్పత్తిని నిలపివేశారు. దీంతో 80 శాతం ఉత్పతికి ఆటంకం ఏర్పడింది.



నిజాంసాగర్

**నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరదనీరు చేరిక**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా వరదనీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు, 17.802 సిఎంసిలు కాగా ప్రస్తుతం 1387.52 అడుగులు, 3.180 టిఎంసిల నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు.

**జూరాల, శ్రీశైలం ప్రాజక్టులకు జలకళ**

గత రెండు రోజులుగా జూరాలకు వరద ప్రవాహం పెరుగుతుండటంతో ప్రాజెక్టు అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం అప్రమతమై జూరాల గేట్ల ద్వారా దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలతో పాటు భీమా నది వరద ఉద్ధృతికి కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. జూరాల జలాశయంలో 317.040 మీటర్లు, 6.805 టిఎంసిల నీటిని నిల్వ ఉంచుకున్నారు. అదేవిధంగా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి 1500, భీమా లిఫ్ట్ 1కు 1300, లిఫ్ట్2కు 750, సమాంతర కాలువకు 300, జూరాల కుడి, ఎడమ కాలువలకు 1,466 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ జలాశయంలో నుంచి దిగువకు 1,45,750 క్యూసెక్కులను వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి నారాయణపూర్‌కు 1,25,000 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్టు అధికారులు తెలిపారు.



ఎల్లంపల్లి

**శ్రీశైలం ప్రాజెక్టులో 821.20 అడుగులకు నీటి మట్టం**

ఎగువ పరివాహక ప్రాంతమైన జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం పెరుగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 96,141 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం నీటిమట్టం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు 821.20 అడుగులు, నీటి నిల్వ 41.6978 టీఎంసీలుగా నమోదైంది.

## విశ్వాస పరీక్ష నెగ్గిన ఓలి

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఓలి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. అదే రోజు మరో 21 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. నేపాల్ రాజ్యాంగాన్ని అనుసరించి, ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన 30 రోజుల్లోగా విశ్వాస పరీక్షను నెగ్గాల్సి ఉంటుంది.

ఈ నిబంధనను అనుసరించి, ఓలి విశ్వాస పరీక్షకు వెళ్లారు. మొత్తం 264 మంది సభ్యులు ఉన్న హౌస్ ఆఫ్ రిప్రజెంటెటివ్స్ (హెచ్‌ఒఆర్)లో 263 మంది ఓటింగ్‌కు హాజరయ్యారు. ఒకరు గైర్హాజరుకాగా, ఓలికి 188 ఓట్లు లభించాయి. సాధారణ మెజారిటీకి 138 ఓట్లు అవసరంకాగా, ఓలి అంతకంటే 50 ఓట్లు అధికంగానే సంపాదించుకున్నారు. ప్రతిపాదనకు వ్యతిరేకంగా 74 ఓట్లు పడ్డాయి. ఓట్లను లెక్కించిన అనంతరం ఓలి విజయం సాధించినట్టు స్పీకర్ దేవరాజ్ ఘిమిరె ప్రకటించారు. సిపిఎన్ యుఎంఎల్, నేపాలీ కాంగ్రెస్‌తో పాటు ఆ కూటమి మిత్ర పక్షాలైన లోక్‌తాంత్రిక్ సమాజ్‌వాది పార్టీ, జనతా సమాజ్‌వాది పార్టీ నేపాల్ సభ్యులు కూడా విశ్వాస పరీక్షను బలపరిచారు. సిపిఎన్ మావోయిస్టు సెంటర్, సిపిఎన్ యూనిఫైడ్ సోషలిస్టు, రాష్ట్రీయ స్వాతంత్ర పార్టీ, రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ వ్యతిరేకించాయి. ఇలావుంటే, ప్రధానిగా ఓలి ప్రమాణస్వీకారం చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను రాజ్యాంగ ధర్మాసనానికి పంపుతున్నట్టు సుప్రీం కోర్టు ప్రకటించింది.

## బిజెపిది జవాబుదారీలేని పాలన

(మొదటి పేజీ తరువాయి)

వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. రెండు నెలల్లో ఎనిమిది ఉగ్రదాడులు/ఎన్‌కౌంటర్లు జరిగినట్లు తెలిపారు. తమ వైఫల్యాల నుంచి నిరుద్యోగం, అధిక ధరల నుంచి దృష్టిని మళ్లించేందుకు బీజేపీ మతోన్మాదాన్ని సాగిస్తోందని, కన్వర్ యాత్ర నెపంతో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఇచ్చిన తాజా ఆదేశాలు మత రాజకీయాలకు అద్దం పట్టాయని వ్యాఖ్యానించారు. దేశాన్ని వెనక్కు నెట్టి... తిరోగమన పద్ధతులు అనుసరిస్తూ విశ్వగురువు కాగలమని బీజేపీ అనుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల్లో ప్రజలు ధిక్కరించినా బీజేపీకి బుద్ధిరాలేదని విమర్శించారు. చత్తీస్‌గఢ్‌లో అమాయక గిరజనులపై దురాగతాలు, బూటకపు ఎన్‌కౌంటర్లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వంతో కేంద్రప్రభుత్వం వివక్షపూరిత వైఖరితో రాష్ట్ర ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కేరళకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి అనివార్యమని, బడ్జెట్‌లో ఇందుకోసం సముచిత కేటాయింపు చేయాలని సంతోశ్ కుమార్ కోరారు. నిరంకుశంగా పార్లమెంటును నడిపించాలని బీజేపీ భావిస్తుండవచ్చుగానీ ప్రజల సమస్యలపై పార్లమెంటులో గొంతెత్తేందుకు సీపీఐ, ఇండియా ఐక్య సంఘటన సిద్ధంగా ఉన్నట్లు సంతోశ్ కుమార్ స్పష్టంచేశారు.

## ప్రజాస్వామ్య వ్యతిరేకులు

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ కార్యకర్తల్లో చైతన్యం తీసుకొచ్చేలా శిక్షణ తరగతులను నిర్వహించేందుకు నీలం రాజశేఖర్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు, ఇప్పుడు చాలావరకు తగ్గాయని తెలిపారు. నీలం రాజశేఖర్‌రెడ్డి తరహా ఎప్పటికప్పుడు ప్రజలను, కార్యకర్తలను మేలుకొల్పే కార్యక్రమాలు మరింత పెరిగి ఉంటే కొత్త భారతంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఉండేవి కావని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఈమాత్రం చైతన్యం ఉన్నదంటే అందుకు ఆనాడు నీలం రాజశేఖర్‌రెడ్డి ఎప్పటికప్పుడు కార్యకర్తల్లో చైతన్యం కల్పించడమే కారణమన్నారు.

**స్వాతంత్ర్యంలో లేనివారూ దేశ భక్తులుగా మార్కెటింగ్**

స్వాతంత్ర్య పోరాటంలో ఎటువంటి పాత్ర లేని సంస్థ, వ్యక్తులు ప్రస్తుతం దేశ భక్తులుగా మార్కెటింగ్ చేసుకుంటున్నారని పరకాల ప్రభాకర్ తెలిపారు. దేశంలో ఇటీవల జరిగిన అనేక పరిణామాలను సమాజం పట్టించుకోవడం లేదని, మొన్న,నిన్న, ఇవాళ జరిగిన అనేక సంఘటనలు సంబంధం లేదనట్టుగానే సమాజం స్పృహ కోల్పోయిందన్నారు. పెట్రో ల్ వంద రూపాయాలకు చేరుకుంటుందనే పెద్ద చర్చ జరిగిందని, చివరకు వంద దాటినా పెద్దగా స్పందన రాలేదని, కాలినడకన వెళ్లిన వలసకార్మికులు చనిపోయారని, పవిత్ర గంగానదిలో వందల మృతదేహాలు తేలాయని ఇటువంటి అనేక సంఘటలను సమాజం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయపార్టీలు ఎన్నికలకు, ఎన్నిలకు మధ్య ఏమీచేయడం లేదని స్లీప్‌వాకింగ్ చేస్తున్నాయన్నారు.

**'ఇజ్రాయిల్ ఉద్యోగాల'కు భారత యువత క్యూ**

పాలస్తీనాకు చెందిన ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో ఇతర దేశాలకు చెందిన వారిని ఇజ్రాయిల్ నియమించుకుంటుందని, ఇందులో భాగంగా ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యా నా రాష్ట్రాలకు చెందిన వారు ఇజ్రాయిల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ వద్ద బారులు తీరుతున్నారని పరకాల ప్రభాకర్ అన్నారు. బాంబుల వర్షంలో ప్రాణాలు కోల్పోతామని ముందే తెలిసినా ఇజ్రాయిల్ ఉద్యోగాలకు భారత యువత క్యూ కట్టడమంటేనే దేశంలో నిరుద్యోగ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్రప్రభుత్వ, ప్రధానమంత్రికి సలహాదారులుగా ఉన్న వారే దేశంలో అసమానతలు ఉండాలని, నిరుద్యోగాన్ని సమర్థిస్తున్నారన్నారు.

**జిఎస్‌టి ఎంత వసూలు చేస్తే.. అంత అల్పాదాయక వర్గాలపై ప్రభావం**

దేశానికి సంబంధించిన పలు లెక్కలు, నిరుద్యోగం లాంటి పలుఅంశాలపైన ఆర్‌బిఐ ఇచ్చే నివేదికను గతంలో ఎవ్వరూ అనుమానించలేదని, కానీ ప్రస్తుతం ఆర్‌బిఐ కూడా రాజీపడిందని, అందుకే ఆర్‌బిఐ నివేదికలను అనుమానించాల్సి పరిస్థితులు వచ్చాయని పరకాల ప్రభాకర్ తెలిపారు. వారానికి ఒక గంట చొప్పున ప్రతి నెలా 30గంటలు పని చేసిన వారిని నిరుద్యోగులుగా గుర్తించబోమని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా తెలిపిందని, నిరుద్యోగానికి ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కొత్త నిర్వచనాన్ని ఇచ్చిందన్నారు. ప్రజలపైన పరోక్షంగా పన్నులను పెంచి, కార్పొరేట్ శక్తులపైన పన్నులను తగ్గించారని, జిఎస్‌టి ఎంత ఎక్కువగా వసూలు చేస్తే, అల్పాదాయక వర్గాలపై అంత ప్రభావం పడుతుందని పరకాల వివరించారు. టి.సురేష్‌బాబు మాట్లాడుతూ నీలం రాజశేఖర్ రెడ్డి కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు ఎంతో కృషి చేశారని, చివరి వరకు నిర్మాణ బాధ్యతలను చూశారన్నారు.

